

విజ్ఞానం పంచుతూ...
విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయులు పలువురి మన్ననలు అందుకుంటున్నారు. 8లో



లైసెన్స్‌లకు అర్హుల గుర్తింపు
ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొత్తగా అడ్తీ లైసెన్సులు జారీ చేసేందుకు గాను అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 25°
వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నాలుగో రోజుకు చేరిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

827మందిలో 365మందికి అర్హత



అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఈమేరకు 1,275 మందికి అడ్మిట్ కార్డులు జారీ చేయగా 827మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో అన్ని ఈవెంట్లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల్లో 365 మంది మెడికల్ టెస్ట్‌లో అర్హత సాధించారు. అభ్యర్థుల వివరాలను బయోమెట్రిక్ విధానంలో నమోదు చేసి, ఎత్తు, బరువు పరిశీలించాక ఒక్కో బ్యాచ్‌కు 100 మంది చొప్పున 1,600 మీటర్ల పరుగు నిర్వహిస్తున్నారు. ఆతర్వాత 9ఫీట్ బ్రాడ్ జంప్, పుల్ అప్స్, జిడ్ క్రాస్ ఈవెంట్లలో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్ట్ చేస్తున్నారు. ప్రతిరోజు అర్ధరాత్రి 12.30గంటల నుంచే భ్యర్థులను స్టేడియంలోకి అనుమతించగా ఉదయం 8గంటలకల్లా అన్ని పరీక్షలు పూర్తిచేస్తున్నారు.

వారసులు పట్టించుకోవడం లేదు..

ఖమ్మంక్రైం: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం సీపీ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యాన నిర్వహించే గ్రీవెన్స్ డేకు ఈసారి ఎక్కువగా వృద్ధుల నుంచి ఫిర్యాదులు అందాయి. వృద్ధాప్యంలో తమను వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అలాగే, భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతోపాటు ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల గొడవలపై ఫిర్యాదులు అందగా, పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించాలని అధికారులను సీపీ ఆదేశించారు.

అండర్‌పాస్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై వివిధ గ్రామాల వద్ద నిర్మించిన అండర్‌పాస్‌ల సమీపాన ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి నేషనల్‌హైవే అధికారులతో కలిసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. అండర్ పాస్‌ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవటంతో కింద నుండి వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, ఆదివారం కూడా జుజుల్‌రావుపేట వద్ద ద్విచక్ర వాహనదారుడిని కంటైనర్ ఢీకొట్టడంతో మతి చెందాడు. దీంతో అధికారులో రంగంలోకి దిగారు.

క్రమశిక్షణతో చదివితేనే విజయం



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఎర్రుపాలెం: విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుంటేనే మంచి ఫలితాలు సాధించొచ్చని, తద్వారా పాఠశాల, తల్లిదండ్రులకు పేరు వస్తుందని డీఈఓ సోమశేఖర్‌శర్మ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, భోజన మెనూను పరిశీలించారు. ఆతర్వాత తరగతి గదిలో కాసేపు విద్యార్థులకు పాఠం బోధించారు. ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కె.సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఖమ్మంక్రైం: ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాల్లో హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుతో సీపీ వారియర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. ఈమేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో నగర సీపీ హరికృష్ణ, సీఐ సత్యనారాయణతో కలిసి సోమవారం హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. శుభకార్యాలు జరిగే ఇళ్లకు వెళ్లి వికృత చేష్టలకు పాల్పడుతూ డబ్బు వసూలు చేయడం మానుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, హిజ్రాలకు సహకరించే ఆటోడ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు. ఈసందర్భంగా శుభకార్యాలకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన నలుగురు హిజ్రాలను పోలీసులు బైండోవర్ చేశారు.

మున్నేరుకు సొబగులు..



ప్రతిపాదనల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి అజయ్‌కుమార్, నీటిపారుదల శాఖ అధికారులు

సీసీతో రక్షణ గోడకు రూ.690.52 కోట్లు మంజూరు

- అంచనా విలువ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- రూ.30 కోట్లతో మూడు చెక్‌డ్యామ్‌లు.. ఇప్పటికే తీగల వంతెనకు రూ.180కోట్లు
- భవిష్యత్‌లో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం నగరానికి ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు సొబగులు అద్దుకోనుంది. జూలైలో వచ్చిన వరద నగరం, ఖమ్మం రూరల్ మండలంలోని పలు కాలనీలను ముంచెత్తింది. రికార్డు స్థాయిలో వరద రావడంతో భవిష్యత్‌లో ఇలాగే వచ్చినా నష్టం జరగకుండా అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం శాశ్వత చర్యలకు ఉపక్రమించింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రతిపాదనలతో మున్నేటికి రెండువైపులా సిమెంట్ కాంక్రీట్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గతంలో రూ.150కోట్లు మంజూరు చేయగా.. ప్రతిపాదనల పరిశీలన అనంతరం రూ.690.52 కోట్లకు పరిపాలనాపర అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండు వైపులా ఆర్‌సీసీ వాల్, కొత్తగా మూడు చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో పాటు ఇప్పటికే మంజూరైన తీగల వంతెన పూర్తయితే మున్నేటిని పర్యాటక ప్రాంతంగానూ తీర్చిదిద్దాలని ప్రణాళిక రూపొందించింది.

33 అడుగుల వరకు గోడ

ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో 33 అడుగుల మేర సీసీ రక్షణ గోడ నిర్మించనున్నారు. ఇటీవల రికార్డు స్థాయిలో 30.7 అడుగుల వరకు వరద వచ్చినందున, మరోసారి వచ్చినా నష్టం ఎదురుకాకుండా గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు చప్టా నుంచి ప్రకాష్‌నగర్ చప్టా వరకు రెండు వైపులా 8 కిలోమీటర్ల చొప్పున మొత్తం 16 కిలోమీటర్లు వాల్ నిర్మిస్తారు. అలాగే, రామన్నపేట, దానవాయిగూడెం, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, రంగనాయకులగుట్ట, శ్రీనివాసనగర్, ప్రకాష్ నగర్ వరకు ఒకవైపు.. అటు ఖమ్మం రూరల్ మండలం వైపు పోలేపల్లి, కరుణగిరి, జలగంనగర్, కోటనారాయణపురం వరకు మరో గోడ నిర్మించనున్నారు.

మూడు చెక్ డ్యాంలకు కూడా నిధులు

సీసీ ప్రొటెక్షన్ వాల్‌తోపాటు మున్నేటిపై మూడు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారు. ప్రకాష్‌నగర్, పద్మావతి నగర్, రంగనాయకులగుట్ట ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తారు. ఇప్పటికే ఉన్న చెక్‌డ్యామ్‌లతోపాటు వీటి నిర్మాణం పూర్తయితే ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలాల్లో భూగర్భ జలాలు మెరుగవుతాయి.

మంత్రి పువ్వాడ ప్రతిపాదనలతో...

జూలై 27న మున్నేరుకు వరద పోటెత్తింది. దీంతో మున్నేటి పరీవాహక ప్రాంత కాలనీలు నీట మునగగా, వేలాది మంది కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో గడిపారు. కాలనీలన్నీ బురదమయంగా మారడంతోపాటు ఇళ్లల్లోని గృహోపకరణాలన్నీ కొట్టుకుపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లు సైతం దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా ప్రాణనష్టం జరగకుండా కాపాడగలిగినా ఇదే పరిస్థితి భవిష్యత్‌లోనూ వస్తే నష్టం జరగకుండా ఇక్కడ ఆర్‌సీసీ వాల్ నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రతిపాదనలు ఉంచారు. దీంతో రెండు వైపులా నాలుగు కి.మీ. నుంచి ప్రస్తుతం 8 కి.మీ. మేర గోడ నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

తీగల వంతెనతో టూరిజం హబ్

మున్నేటిపై పాత బ్రిడ్జి స్థానంలో తీగల వంతెన నిర్మాణానికి ఇప్పటికే రూ.180 కోట్లు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లో దుర్గంచెరువు మాదిరిగా ఇక్కడ తీగల వంతెన నిర్మిస్తారు. సీసీ ప్రొటెక్షన్ వాల్, తీగల వంతెన, మూడు చెక్‌డ్యామ్‌లతో నగరానికి సమీపాన ఉన్న మున్నేటికి కొత్త రూపు రానుండడంతో భవిష్యత్‌లో టూరిజం హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తొలుత రక్షణ గోడ నిర్మాణం పూర్తికాగానే బోటింగ్ ఏర్పాటుచేయాలనే యోచనలో ఉన్నారు. కాగా, ప్రభుత్వం సీసీ ప్రొటెక్షన్ వాల్‌కు నిధులు మంజూరు చేసిన నేపథ్యాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. జలవనరుల శాఖ ఈఈ అనన్య, డీఈ ఉదయ్‌ప్రతాప్, ఏఈ రాజేశ్వరరావు తదితరులతో కలిసి ప్రతిపాదనల మ్యాప్‌ను పరిశీలించారు.

ఈనెల 14న ఖమ్మంకు మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన అవకాశంతో ఖమ్మం నియోజకవర్గాన్ని రూ.2 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని, మరో రూ.వెయ్యి కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరగనున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని తన నివాసంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఖమ్మం నలుదిశలా అభివృద్ధి జరిగిందన్నారు. తాజాగా ప్రభుత్వం సీసీ ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.690.52 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిర్మాణంతో ప్రజల కష్టాలు శాశ్వతంగా తీరుతాయని వెల్లడించిన ఆయన, నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, నిధులకు సంబంధించి మంత్రి కేటీఆర్ తనను ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలోని ఎనిమిది ప్రభుత్వ వైద్య కళాశాలను సీఎం కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించనుండగా, 14న ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లాకు వస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వైద్యకళాశాల తరగతుల ప్రారంభ సమావేశంలో పాల్గొనడమే కాక తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావు 85వ పుట్టిన రోజు వేడుకలకు హాజరవుతారని తెలిపారు. ఇదేరోజు మమత వైద్య కళాశాల సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- జిల్లాలోని 551 చెరువుల్లో 2 కోట్ల చేపపిల్లలు
- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



కోటపాడు చెరువులో చేపపిల్లలు వదులుతున్న మంత్రి అజయ్, కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెం: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం కోటపాడులోని మాచినేని చెరువులో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ఆయన చేపపిల్లలను వదిలారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 100 శాతం రాయితీపై జిల్లాలోని 551 చెరువుల్లో 2.02కోట్ల చేపపిల్లలు వదలనున్నట్లు తెలిపారు. తద్వారా మత్స్యకారులకు లబ్ధి జరగనుందని, ఇప్పటికే జిల్లా మత్స్యకారులు చేపలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారని చెప్పారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలోని 54 నీటి వనరుల్లో 3.35 లక్షల చేపపిల్లలు వదలనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి అంజనేయస్వామి, పీఆర్ ఈఈ కేవీఏ.శ్రీనివాస్, వైస్ ఎంపీపీ గుత్తా రవి, సర్పంచ్ బాతుల రమణీ సుధాకర్, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ విల్సన్ బెన్నీతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు కొంటిముక్కల వెంకటేశ్వర్లు, మద్దినేని వెంకటరమణ, నెల్లూరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత చెరువు కట్టపై గంగమ్మ తల్లికి మంత్రి, కలెక్టర్ పూజలు చేశారు.

వండే వారు లేక విద్యార్థులకు ఇక్కట్లు

రఘునాథపాలెం: వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్న గురుకులంలో కేవలం ఒకే వంట మాస్టర్ ఉండడంతో మెనూ ప్రకారం భోజనం అందక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. రఘునాథపాలెంలోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ భవనంలో చెరువుమాదారం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కాలేజీ కొనసాగుతుండగా 500 మందిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి వంట చేసే కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి కొద్దిరోజులుగా ఒకే వంట మాస్టర్, సహాయకులతో పని చేయిస్తున్నాడు. దీంతో మెనూ ప్రకారం కాకుండా టిఫిన్‌గా కేవలం ఉప్మా, కిచిడీ అందిస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సీహెచ్.విద్యాధరణిని వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ రాజశేఖర్ తాను వంట చేయలేనని చెబుతూ ప్రిన్సిపాల్‌కు లేఖ అందించడంతో విద్యార్థులకు భోజనం ఆగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాక అధికారులతో సమీక్షించారు.

పోషణ మాసాన్ని విజయవంతం చేయండి

ఈ నెలలో నిర్వహించే పోషణ మాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడుతూ ఆరోగ్యానికి చిరుధాన్యాలు చేసే మేలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాల కురుస్తున్న నేపథ్యాన డెంగీ ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. డెంగీ నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. గత మూడేళ్లలో కేసులు అధికంగా నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రోజుకు కనీసం 300 మందికి పరీక్షలు నిర్వహించడమే కాక పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, డెంగీపై చైతన్యం కల్పించాలని చెప్పారు.

అర్హులందరికి రుణమాఫీ

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. హైదరాబాద్ నుండి సోమవారం ఆయన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీసీ ద్వారా సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో రుణ మాఫీ సాఫీగా సాగుతోందని వెల్లడించారు. అనంతరం ఆసరా పెన్షన్లు, కారుణ్య నియామకాలు, గృహలక్ష్మి, జీఓ 59పై చర్చించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారి సుమ, జెడ్పీ సీఈఓ అప్పారావు, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీఏఓ సరిత, జిల్లా సహకార శాఖ అధికారి విజయకుమారి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సైదులు, సత్తుపల్లి కమిషనర్ సుజాత, అధికారులు వెంకట్రాం, అరుణ, మదన్‌గోపాల్, రంజిత్ పాల్గొన్నారు.

రూత్‌జాన్ ఆదర్శం

ట్రాన్స్‌జెండర్లు, అట్టడుగు వర్గాల వారికి రూత్‌జాన్ కొయ్యల ఆదర్శంగా నిలుస్తారని కలెక్టర్ గౌతమ్ అభినందించారు. ఖమ్మం రమణగుట్టకు చెందిన రూత్‌జాన్ హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఉస్మానియా ఏఆర్‌టీ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తోంది. తాజాగా ఆమె పీజీ సీటు సాధించిన నేపథ్యాన ఖమ్మంలో ఆమెను కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన రూత్‌జాన్ పీజీ పూర్తయ్యాక ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు.

మెడికల్ కాలేజీలో పనులు పూర్తిచేయండి

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ వైద్య కళాశాల మిగులు పనులన్నింటినీ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ప్రభుత్వ కళాశాలకు సోమవారం రాత్రి వచ్చిన ఆయన పనులపై ఆరా తీశారు. లెక్చర్ హాల్‌తో పాటు ఆర్ అండ్ బీ శాఖ, డీఎంహెచ్‌ఓ కార్యాలయాల్లో ఏర్పాటుచేస్తున్న హాస్టళ్ల పనులను పరిశీలించి సూచనలు చేశారు. హాస్టళ్లలో ఉండేందుకు 60మందికి పైగా నమోదు చేసుకునేందుకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఆతర్వాత కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని తనిఖీ చేసి డెంగీ పరీక్షలు, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆర్‌ఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉదయం పంపిణీ.. రాత్రి బేరం?

కిష్టారంలో గొర్రెల యూనిట్లపై అనుమానాలు



రాత్రి వరకు కిష్టారం పశువైద్యశాలలోనే ఉన్న గొర్రెలు

సత్తుపల్లిరూరల్: గొల్ల, కురుమల జీవనోపాధి కోసం ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా సత్తుపల్లి మండలం కిష్టారంలో సోమవారం 12 యూనిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్ చెట్టుమాల రేణుక ఈశ్వర్, ఎంపీటీసీ పాలకుర్తి సునీత, జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు తదితరులు పాల్గొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఐదు యూనిట్లను అమ్మేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. వీటిని రాత్రి వరకు స్థానిక పశువైద్యశాల ఆవరణలోనే ఉంచగా... చిల్లకల్లు సంతకు తరలిస్తున్నట్లు తెలియడంతో జనసేన నాయకులు బండి నరేష్, ఆళ్ల నరేష్ తదితరులు ప్రశ్నించారు. అయితే, గొర్రెలు వయస్సు మళ్లినవే కాక అనారోగ్యంగా ఉండడంతో పాటు ఇక్కడి వాతావరణానికి తట్టుకోలేక చనిపోతాయోననే భయంతో సంతకు తీసుకెళ్తున్నామని లబ్ధిదారులు తెలిపారు. రూ.లక్ష విలువైన గొర్రెలను రూ.70వేలకు అమ్మేందుకు ముందుగానే ఒప్పందం కుదిరిందని, ఇందుకు పశు వైద్యాధికారులు సహకరించారని నాయకులు ఆరోపించారు. కాగా, మీడియాకు వెల్లడించకుండా రహస్యంగా గొర్రెలను పంపిణీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కిష్టారం ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి సాహిత్య వివరణ కోసం 'సాక్షి' ఫోన్ చేయగా.. ఆమె భర్త అయిన గంగారం పశువైద్యాధికారి గంగాధర్ మాట్లాడారు. తమ వద్ద మీడియాకు సంబంధించి ఫోన్ నంబర్లు లేకపోవడంతో అందరికీ చెప్పాలని ఎంపీటీసీ పాలకుర్తి సునీత భర్త రాజును కోరినట్లు వెల్లడించడం గమనార్హం.

ఊరిస్తున్న వాన !

ఖమ్మంవ్యవసాయం: రెండు రోజులుగా జిల్లా రైతులను వాన ఊరిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోగా, పలుచోట్ల ఓ మోస్తరు నుంచి తేలికపాటి వాన పడుతోంది. సోమవారం సైతం జిల్లాలోని సత్తుపల్లిలో 32 మి.మీల వర్షపాతం నమోదు కాగా. అదే మండలం గంగారంలో 24 మి.మీలు, తిరుమలాయపాలెలో 20.8 మి.మీల వర్షపాతం నమోదైంది. ఇక మిగిలిన పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అయితే, వైరా, మధిర, ఎర్రుపాలెం, వేంసూరు, తల్లాడ, ఖమ్మం రూరల్, బోనకల్ మండలాల్లో వాన జాడేలేదు. కాగా, ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. కాగా, పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో సాగులో ఉన్న పైర్లకు కొంత మేర ప్రయోజనం కలుగుతుందని రైతులు చెబుతున్నారు. మంగళవారంతో పాటు మరో రెండు రోజుల వరకు కూడా వర్షసూచన ఉందని అధికారులు వెల్లడించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 28మంది

ఖమ్మం సహకారనగర్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకోనుండగా, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. మొత్తంగా 28మందిని ఎంపిక చేసిన అధికారులు సోమవారం జాబితా విడుదల చేశారు. ఎంపికైన వారిని మంగళవారం కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించనున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి వివరాలిలా ఉన్నాయి. సీహెచ్.వెంకటేశ్వరరావు(పెనుబల్లి, వేంసూరు ఎంఈఓ), ఎం.శంకర్‌రావు(హెచ్‌ఎం జీహెచ్‌ఎస్, ఎన్నెస్పీ కాలనీ, ఖమ్మం), బి.నర్సింహారావు(గ్రేడ్-2 హెచ్‌ఎం, వీఎం బంజర్, పెనుబల్లి), ఆర్.విక్రమ్‌రెడ్డి(గ్రేడ్-2 హెచ్‌ఎం, కూసుమంచి), సీహెచ్.ప్రసాద్(ఎల్‌ఎఫ్‌ఎల్, హెచ్‌ఎం, ఎంపీపీఎస్, సత్తుపల్లి), హెచ్.శ్రీనివాస్(ఎల్‌ఎఫ్‌ఎల్, హెచ్‌ఎం, ఎంపీపీఎస్ సింగిరెడ్డిపాలెం, నేలకొండపల్లి), హేమాద్రి శైలేంద్ర(జెడ్పీఎస్‌హెచ్‌ఎస్, గోళ్లపాడు, పోలేపల్లి, ఖమ్మం రూరల్), కోలా పద్మావతి(జెడ్పీహెచ్‌ఎస్, మడుపల్లి, మధిర), బి.సంగమేశ్వరరావు(టీవీఎం, జీహెచ్‌ఎస్, మధిర), సింగిరెడ్డి సునీత(ఎంపీపీఎస్, మిట్టగూడెం కాలనీ, ముదిగొండ), కిలారు జ్యోతి కుమారి(పీఎస్, ఇందిరానగర్, ఖమ్మం), అల్లి ప్రవీణ్‌కుమార్(ఎంపీపీఎస్, పెదవెంకటగిరి, ఖమ్మం రూరల్), అల్లూరి అనిత (జెడ్పీహెచ్‌ఎస్, ముష్టికుంట్ల, బోనకల్), గెంటెల రూన్సీరాణి(జెడ్పీహెచ్‌ఎస్, బోనకల్), జంగా గురునాథరెడ్డి(ఎంపీపీఎస్, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం), పి.లూర్దు మేరీ(జెడ్పీహెచ్‌ఎస్, మంగళగూడెం, ఖమ్మం రూరల్), డి.నాగేశ్వరరావు(టీడబ్ల్యూఏహెచ్‌ఎస్, రేలకాయలపల్లి, సింగరేణి)కి స్థానం దక్కింది. అలాగే, రామడుగు శ్రీనివాసాచారి(ఎంపీపీఎస్, వైరా), కంభంపాటి వెంకటేష్(ఎంపీపీఎస్, అయ్యగారిపేట, సత్తుపల్లి), జి.శ్రీనివాసరావు(జెడ్పీహెచ్‌ఎస్, నామవరం, చింతకాని), కొండా ప్రభుదాస్(ఎంపీపీఎస్ కిష్టాపురం, సత్తుపల్లి), కుచిపుడి రాజ్‌కుమార్(యూపీఎస్, బుద్ధారం, నేలకొండపల్లి), దాసరి వెంకటేశ్వరరావు(ఎంపీపీఎస్, విప్పలమడక, వైరా), లింగనబోయిన గోపాలరావు (యూపీఎస్, గణేశ్వరం, రఘునాథ పాలెం), గాజుల భారతి(ఎంపీపీఎస్, ముత్తగూడెం, ఖమ్మం రూరల్), ధరావత్ రాములు(ఎంపీపీఎస్, గుడిమళ్ల, ఖమ్మం రూరల్), బానోతు శ్రీనివాసరావు(ఎంపీపీఎస్ పోచవరం, కల్లూరు), అత్తునూరు శాంతరెడ్డి(జీహెచ్‌ఎస్, వైరా) జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఉన్నారు.

అజ్ఞానం పారదోలి.. విజ్ఞానం పంచుతూ..

- విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- సొంత ఖర్చులతో విద్యాలయాల్లో వసతుల కల్పనకు కృషి

నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం చూపుతారని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ పలువురు ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గేలా మెళకువలు నేర్పుతున్నారు. సొంత ఖర్చులతో విద్యాలయాలను బాగు చేయిస్తున్నారు. వైకల్యాన్ని జయించి తాము ఉన్నత స్థాయికి చేరడమే కాక విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి వారిలో కొందరు ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు.

విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయం

అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఉషాకుమారి

ముదిగొండ: మండల కేంద్రంలోని మిట్టగూడెం ఎస్సీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయులు ఇక్కడి విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేలా ఉత్తమ బోధన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో 110 మంది విద్యార్థులకు గాను నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల గోడలపై పాఠ్యాంశాల్లోని పదాలు, గణిత, తెలుగు, ఆంగ్ల పదాలే కాక చిత్రాలను అందగా వేయించడంతో బోధన సులువవుతోంది. పాఠ్యపుస్తకాల్లోని దాదాపు అన్ని అశాలు అక్కడ చిత్రాల రూపంలో కనిపిస్తాయి. దీంతో బోధన సులువవుతోందని, విద్యార్థులకు త్వరగా అర్థమవుతాయని చెబుతున్నారు. ఇటీవల పాఠశాల విద్యార్థులు గురుకులాల్లో ఐదో తరగతిలోకి ప్రవేశానికి 18మంది పరీక్ష రాయగా అందరూ సీట్లు సాధించడం విశేషం. కాగా, ఉపాధ్యాయులు 112 బోధనోకరణాలను తయారు చేసి వీటి ఆధారంగా బోధన సాగిస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రధానోపాధ్యాయుడు రంగారావుతో పాటు ఉపాధ్యాయులు ఉషాకుమారి, సునీత, సురేష్ తీసుకుంటున్న శ్రద్ధతో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు నిలుస్తుండగా... ముదిగొండ మండలంలోనే ఈ పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.



ఎస్.సునీత, ఉపాధ్యాయురాలు

బోధనోపకరణాల సాయంతో...



తరగతి గదులు, గోడలపై పాఠ్యాంశాలు

సమయపాలన పాటించి క్రమశిక్షణతో బోధనోపకరణాలతో బోధిస్తున్నామని ఉపాధ్యాయులు ఆర్.ఉషాకుమారి తెలిపారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి ఉత్తీర్ణత శాతం పెరుగుతోందని చెప్పారు. మరో ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీత ఎస్.సునీత మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా విద్యార్థులకు బోధిస్తుండగా, క్రమశిక్షణ, శ్రద్ధతో చదువుకుంటున్నారని తెలిపారు. పాఠశాలపై మక్కువతో విద్యార్థులు కూర్చోవడానికి రూ.40వేల విలువైన 20 బల్లలను అందించానని చెప్పారు. ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు.

మా మంచి మాస్టారు..

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు సురేష్

నేలకొండపల్లి: గురువు సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచే వ్యక్తి. అయితే, కేవలం బోధనతోనే సరిపెట్టకుండా ప్రయోగాత్మకంగా వివరిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు నేలకొండపల్లి మండలం బుద్దారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇటిక్యాల సురేష్. ఈయన మండల స్థాయిలో కార్యక్రమాల్లో క్యూఐపీ, క్లిప్, క్లాప్, లెప్ కార్యక్రమాల్లో డీఆర్‌పీగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థులకు పాఠాలు నేర్పడమే కాకుండా పలు అంశాల్లో అర్థమయ్యే రీతిలో ప్రయోగాల ద్వారా వివరిస్తుండడంతో మంచి పేరు సాధించారు. మండల స్థాయిలో నిర్వహించిన మేళాలో అనేక బహుమతులు సాధించాడు. గ్రామంలో బడిబాట, పల్స్‌పోలియో, హరిత హారం, వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లోనూ ఆయన చురుగ్గా పాల్గొంటారు. బడి బయటి పిల్లలను చేర్పించేందుకు చేసిన కృషికి గాను 2009లో జిల్లా ఉత్తమ టీఎల్ఎంగా మొదటి బహుమతి సాధించారు. అలాగే, 2011లో ఉత్తమ ఉపాధ్యాయుడు, 2013లో ఉత్తమ స్టేట్ రిసోర్స్ పర్సన్ అవార్డులతో పాటు అనేక ప్రశంసాపత్రాలను సాధించారు. ఇక పాఠశాలకు విద్యార్థులు నవోదయ, గురుకుల పాఠశాలలు, ఇతర పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దుతూ, అవసరమైన వారికి సొంత డబ్బుతో మెటీరియల్ అందజేస్తారు.

విద్యార్థులు ఇబ్బంది పడొద్దని..

రూ.1.20 లక్షలతో మరమ్మతు చేయించిన హెచ్‌ఎం



రేకులు వేసిన అదనపు తరగతి గదులు

ఖమ్మం సహకారనగర్: గతంలో వర్షం వస్తే ఆ పాఠశాల గదులు కురవటంతోపాటు ఏ సమయంలో ఏం జరుగుతుందోననే ఆందోళన ఉండేది. అలాంటి పాఠశాలకు రూ.1.20 లక్షల సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించిన కూసుమంచి మండలం అగ్రహారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావిళ్ల విజయ్‌కుమార్ పలువురి మన్ననలు అందుకున్నారు. ఆయన 2018లో అక్కడ విధుల్లో చేరగా పాఠశాల శిథిలావస్థలో ఉంది. దీంతో విద్యార్థులకు నష్టం జరగవద్దని భావించిన ఆయన గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా గదుల స్లాబ్ తొలగించారు. అయితే, దాతలు సహకరిస్తే పాఠశాలను మరింత అందంగా తీర్చిదిద్దాలని భావించగా ఎక్కువ మంది ముందుకు రాలేదు. దీంతో ఆయన రూ.1.20లక్షలు వెచ్చించి గదులపై రేకులు వేయించడంతో పాటు రంగులతో తీర్చిదిద్దారు. తద్వారా విద్యార్థుల ఆందోళన తొలగిపోగా, నాటి కంటే క్రమంగా ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది.

ఇబ్బందులు తొలగించాలని...



నేను 2018లో విధుల్లో చేరాను. ఎంఈఓ, ఎంపీడీఓల సహకరించడమే కాక కొందరు స్థానికులు కలిసి రావడంతో స్లాబ్ తొలగించి రూ.1.20లక్షలతో రేకులు వేసి తీర్చిదిద్దాం. చిన్న మరమ్మత్తులు చేపట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కల్పించాం. ఇంకా మరుగుదొడ్ల నిర్మాణం, వాటర్ ట్యాంక్ ఏర్పాటుచేయాల్సి ఉంది.

– రావిళ్ల విజయ్‌కుమార్, హెచ్‌ఎం ఎంపీపీఎస్, అగ్రహారం

బోధనలో మేటి.. సమాజసేవలో ఘనాపాటి

అందరి మన్ననలు అందుకుంటున్న వెంకటేష్



గేయ పద్ధతిలో గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేష్

సత్తుపల్లిటౌన్: బోధనలో ప్రత్యేకత కనబరుస్తూ, వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాక సామాజిక సేవలోనూ ముందుంటున్నారు ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేష్. సత్తుపల్లి గాంధీనగర్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వెంకటేష్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గేయాలతో గణిత బోధన చేస్తూ పిల్లల్లో ఆసక్తి పెంపొందిస్తున్న ఆయన విరామ సమయంలో సమాజ సేవ చేస్తున్నారు. 2010లో రేజర్ల ప్రాథమిక పాఠశాలలో నియామకమైన ఆయన సత్తుపల్లి గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఐదేళ్లు నిండిన తన కుమారుడు విహాన్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు పాఠాలు బోధించే ఆయన పేద పిల్లలకు నోట్‌పుస్తకాలు, పిల్లలు బడికి వచ్చేలా ప్రేరణ కల్పిస్తారు. మరోపక్క 2018లో నిరుపేదలకు పాత వస్త్రాలు అందించేలా 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' నిర్వహించారు. మిత్రులతో కలిసి చేతన ఫౌండేషన్ ద్వారా కోవిడ్ సమయంలో సేవలందించారు.

అందుకున్న అవార్డులు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సమాజ సేవకుడిగా వెంకటేష్‌ను పలు సంస్థలు సత్కరించాయి. అయితే, డాక్టర్ సి.నారాయణరెడ్డి నుంచి పొందిన సత్కారం మరువలేని జ్ఞాపకమని ఆయన చెబుతారు. అలాగే, మరికొన్ని సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

సేవలో ముందంజ... రిటైర్డ్ హెచ్‌ఎం

విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యం



మెడిసిన్ విద్యార్థినికి చెక్కు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య, తదితరులు

ఖమ్మం సహకారనగర్: చదువుకునే సమయంలో తాను పడిన కష్టం మరొకరు పడొద్దనే భావనతో విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు రిటైర్డు హెచ్‌ఎం పరిశ పుల్లయ్య. తల్లాడ మండలం పాత మిట్టపల్లికి చెందిన ఆయన తాను చదువుకునే రోజుల్లో అష్టకష్టాల నడుమ విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ఉద్యోగంలో స్థిరపడ్డాడు. నాటి నుంచి అవసరమైన వారికి తోచినంత సాయం చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేశాక కూడా తన సతీమణి పరిశ సీతారత్నం పేరిటట పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాల్లో కొనసాగిస్తున్నారు. 1980 మార్చి 28వ తేదీన నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట మండలంలో ఎస్‌జీటీగా విధుల్లో చేరిన పుల్లయ్య 2017 ఫిబ్రవరి 28న ముదిగొండ మండలం బాణాపురం హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లో ఉన్న కాలంలో విద్యార్థులకు అవసరమైన పలు రకాల సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. అనంతరం 2022వ సంవత్సరంలో ట్రస్ట్ ఏర్పాటుచేయగా, 2022–23వ సంవత్సరంలో 12మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.1.25లక్షలు, 10మంది వైద్య విద్యార్థులకు రూ.1.60లక్షలు, బీ ఫార్మసీ విద్యార్థినికి రూ.20వేలు, అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థినికి రూ.17వేలు, ఐఐటీ విద్యార్థులు ముగ్గురికి రూ.15వేలు అందజేశారు. అలాగే, విద్యాసంస్థల్లో అవసరాలకు రూ.1,34,563 సమకూర్చారు.

బాలికపై బలాత్కారం కేసులో ఐదేళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: బాలికపై బలాత్కారం చేసిన కేసులో ఖమ్మం టేకులపల్లికి చెందిన చిట్టిప్రోలు రాము వెంకట సత్యనారాయణ ప్రసాద్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి సోమవారం తీర్పుచెప్పారు. ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. బాలిక ఆడుకుంటుండగా నిందితుడు చాక్లెట్ ఆశ చూపి ఇంట్లోకి తీసుకెళ్లి బలత్కారం చేశాడని 2022 అక్టోబర్ 31న ఖానాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా... విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ కొత్త వెంకటేశ్వరరావు వాదించగా డి.శ్రీనివాసరావు, వి.భద్రునాయక్, కె.మోహన్‌రావు, ఎం.డీ.అయూబ్ సహకరించారు.

చెల్లని చెక్కు కేసులో...

చెల్లని చెక్కు జారీచేసిన కేసులో ఖమ్మంకు చెందిన బబ్బూరి పద్మావతికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.దీప తీర్పు చెప్పారు. నగరానికి చెందిన ఎం.అజయ్‌కుమార్ వద్ద పద్మావతి రూ.1.50 లక్షల అప్పు తీసుకోగా, 2015 మే 16న చెక్కు ఇచ్చింది. అయితే, ఆ చెక్కు చెల్లకపోవడంతో న్యాయవాది రమేష్ ద్వారా కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆమెకు జైలుశిక్ష విధించడంతో పాటు నగదు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ముదిరాజ్‌లకు అన్యాయం చేసిన పార్టీలకు బుద్ధిచెబుదాం

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజ్‌లకు రాజకీయంగా అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసిన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో ఏర్పాటుచేసిన సంఘం నూతన కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీలకతీతంగా ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతనం జిల్లా అధ్యక్షుడిగా కొప్పెర జానకీరాములు, ప్రధాన కార్యదర్శిగా నర్ల శ్రీనివాసరావుతో పాటు నూతన కమిటీని ప్రకటించారు. ఈసమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శంకర్, నాయకులు శివయ్య, రాజు, డాక్టర్ శీలం పాపారావు, పిట్టల వెంకటనర్సయ్య, రావుల హన్మంతరావు, కాశబోయిన అనంతరాములు, మామిడి వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, సైదులు, ఒరా వెంకటేశ్వర్లు, కేశవులు, పఠానపు వెంకటేశ్వర్లు, రమేష్, నాగేశ్వరావు, సీతారాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గురు రైతులపై కేసు నమోదు

రహదారి సర్వేను అడ్డుకున్నారనే ఫిర్యాదుతో కేసు

చింతకాని: మండలంలోని కొదుమూరుకు చెందిన రైతులు అనుబోతు వెంకటేశ్వర్లు, పెంట్యాల వెంకటేశ్వరరావు, జలగం రాజారావుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... నాగపూర్ నుంచి అమరావతి వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం కొదుమూరులో డ్రోన్ కెమెరాల ద్వారా సర్వే చేసేందుకు ఆదివారం అధికారులు వచ్చారు. దీంతో రైతులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, రాజారావు తమ భూముల్లో సర్వే చేయటానికి మీరెవరంటూ అడ్డుకుని అసభ్య పదజాలంతో దూషించడమే కాక డ్రోన్ కెమెరాను లాక్కొని ధ్వంసం చేశారు. డ్రోన్ కెమెరాను ధ్వంసం చేయటంతో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని జాతీయ రహదారి సైట్ ఇంజనీర్ చుండూరు వెంకట కోటేశ్వరరావు చేసిన ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.


డెంగీ జ్వరంతో బాలుడు మృతి

తిరువూరు నుంచి ఖమ్మం.. ఆపై విజయవాడ తరలిస్తుండగా...



ప్రవీణ్ (ఫైల్)

పెనుబల్లి: డెంగీ జ్వరం బారిన పడిన ఎనిమిదేళ్ల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెనుబల్లికి చెందిన నిమ్మల శ్రీనివాస్ కుమారుడు ప్రవీణ్(8) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో సోమవారం తిరువూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రవీణ్‌ను పరీక్షించిన వైద్యులు డెంగీ జ్వరంతో పరిస్థితి విషమించని చెప్పి విజయవాడ లేదా హైదరాబాద్ తీసుకెళ్లాలని తెలిపారు. దీంతో ఆయనను విజయవాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఒకటో తరగతి చదువుతున్న ప్రవీణ్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.















క్లుప్తంగా...

'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరి

చైర్మన్ సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు 'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ఆ సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. తద్వారా కొనుగోలుదారుల నమ్మకానికి భరోసా ఇవ్వాలని అన్నారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రాజెక్టులకు సోమవారం ఆయన షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజులలోగా వివరణ ఇవ్వాలని సంబంధిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆదేశించారు. షాద్‌నగర్ సమీపంలోని చెరుకుపల్లి, కొందుర్గ్‌లో స్వర్గసీమ శాండిల్ ఉడ్ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ 'స్వర్గసీమ సుకేతన' పేరుతో నివాస ప్లాట్లు విక్రయించే వెంచర్ చేపట్టి 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టడంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. మాదాపూర్‌కు చెందిన జేఎల్ఎల్ అనే నిర్మాణ సంస్థ 'రెరా' రిజిస్ట్రేషన్ పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం అథారిటీ దృష్టికి వచ్చినందున షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. మహేశ్వరం, తుక్కాపూర్ గ్రామం, శ్రీనగర్ ప్రాంతాలలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 ప్రాంతంలో 'కాంస్టెల్లా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు' రెరా రిజిస్ట్రేషన్ ఉండి కూడా ప్రకటనలో, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ చూపని కారణంగా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

వెంకటేశ్వర హ్యాచరీస్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

మహారాష్ట్ర, కర్ణాటకలో కలిపి రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తుల జప్తు

సాక్షి, హైదరాబాద్: నగదు చెల్లింపులలో అక్రమాలపై ఫెమా చట్టాల (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మెనేజ్‌మెంట్ యాక్ట్) కింద నమోదైన కేసులో వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి లండన్‌లోని వెంకీస్ ఓవర్‌సీస్ లిమిటెడ్ కంపెనీకి 2011 నుంచి అక్రమంగా నిధుల మళ్లింపు జరిగినట్లు గతంలోనే గుర్తించిన ఈడీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ అక్రమ చెల్లింపుల సొమ్ముతో లండన్‌లోనూ స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. అన్ని కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కర్ణాటక, మహారాష్ట్రలోని తొమ్మిది స్థిరాస్తులను జప్తు చేసినట్టు వెల్లడించారు.

చిట్టాలో చినబాబు!

▶ మొదటి పేజీ తరువాయి



మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆ రోజు చంద్రబాబు పీఏ శ్రీనివాస్ డబ్బుల పంపిణీ గురించి అడగ్గా కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను పార్టీ ఆఫీసులో అందించినట్లు పార్థసాని పేర్కొన్నాడు. అంకిత్ బలదూత ద్వారా రూ.2.2 కోట్లు పంపగా, రఘు రేలాకు సన్నిహితుడైన శ్రీకాంత్ ద్వారా మిగిలిన మొత్తాన్ని పంపినట్లు చెప్పడంతో ''అయితే ఓకే..'' అంటూ చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బదులిచ్చాడు. ఈమేరకు నగదు తరలింపులకు సంబంధించి శ్రీకాంత్ ఫోన్ నుంచి జరిగిన వాట్సాప్ సంభాషణలను కూడా ఐటీ అధికారులు జత చేశారు. వాంగ్మూలం నమోదు సమయంలో ఈ సంభాషణలను మనోజ్ వాసుదేవ్‌కు చూపగా అది నిజమేనని అంగీకరించినట్లు ఐటీశాఖ పేర్కొంది. డేటా చౌర్యం ఐటీ గ్రిడ్ కేసులో కూడా కిలారు రాజేష్ కీలక పాత్రధారిగా వ్యవహరించిన విషయం విదితమే.

రఘు ద్వారా రూ.20.18 కోట్లు తరలింపు..

విశాఖకు చెందిన రఘు రేలా ఆర్‌వీఆర్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు 18కిపైగా కంపెనీలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. షాపూర్జీ పల్లోంజీ నుంచి అక్రమంగా నగదు తరలింపులో రఘు రేలా కీలకపాత్ర పోషించినట్లు గుర్తించిన ఐటీ అధికారులు ఆర్‌వీఆర్ గ్రూపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల ఆధారంగా మనోజ్ వాసుదేవన్‌ను విచారించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రఘు రేలా ద్వారా మొత్తం రూ.20.18 కోట్లను తరలించినట్లు మనోజ్ పార్థసాని అంగీకరించాడు. ఈ నగదు తరలింపులో రఘుకు సన్నిహితులైన కృష్ణ, నారాయణ అనే ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, అయితే వారి గురించి తనకు ఎటువంటి వివరాలు తెలియవని పేర్కొన్నాడు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఈ మొత్తాన్ని తరలించారని, ఇందుకు ఎక్సెల్ షీట్ స్పష్టమైన ఆధారమని ఐటీ శాఖ వెల్లడించింది.

ఓటమిపై ఆవేదన

నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించిన మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. టీడీపీ ఘోరంగా ఓడిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన పీఏ శ్రీనివాస్‌కు మనోజ్ వాసుదేవ్ ఒక మెసేజ్ పంపారు. తన జీవితంలో ఇటువంటి దారుణమైన రాజీనామా లేఖను చూడలేదని అందులో పేర్కొన్నారు. వీరి మధ్య బంధం ఎంత బలంగా ఉందనేందుకు ఆ మెసేజ్ నిదర్శనమని ఐటీ శాఖ తన నోటీసులో పేర్కొంది. నిర్మాణ రంగ సంస్థల నుంచి నగదును అక్రమంగా తరలించారనేందుకు ఇవి తిరుగులేని సాక్ష్యాలని, నగదు తరలింపులో మీ తనయుడు లోకేష్ సన్నిహితులు కీలకపాత్ర పోషించారనేందుకు ఇవన్నీ నిదర్శనమని చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో ఐటీ శాఖ స్పష్టంగా పేర్కొంది.

సిరిధాన్యాలపై అంతర్జాతీయంగా ఆసక్తి

- కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే
- విత్తనాలు, ఆహార ఉత్పత్తులపై విదేశీ ప్రతినిధుల వాకబు
- వ్యవసాయంపై జీ–20 సదస్సు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి అనుకూలమైన సిరిధాన్యాలపై ఇప్పుడు అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ–20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో మొదలైన 'క్లైమేట్ రెసిలియెంట్ ఫార్మింగ్' టెక్నికల్ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీ–20 సమావేశాల్లో పాల్గొంటున్న అనేక దేశాల ప్రతినిధులు, సిరిధాన్యాలపై ఆసక్తికనబరుస్తున్నారని, విత్తనాలతోపాటు ఉత్పత్తులు, వాటి తయారీ పద్ధతుల గురించి వాకబు చేస్తున్నారని తెలిపారు. విదేశీ ప్రతినిధుల ఆసక్తి ముఖ్యంగా రాగి విత్తనాలపై కనిపించిందని, మరికొందరు ఇతర ధాన్యాల గురించి కూడా అడిగారని, దేశంలోనూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా సిరిధాన్యాలు సాగు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని వివరించారు.

వాతావరణ మార్పులు తట్టుకోవడానికి ..

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిని ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ సమస్యను అధిగమించేందుకు అందరూ చేతులు కలపాలని మంత్రి పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు భారత్ సిరిధాన్యాలను ప్రోత్సహిస్తోందన్నారు. చాలా రాష్ట్రాల్లో సిరిధాన్యాలను రేషన్ డిపోల ద్వారా కూడా అందిస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయం విషయంలో కొన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించడం లేదని మంత్రి కరంద్లాజే ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు ఐసీఏఆర్ ఇప్పటికే దాదాపు 1,880 కొత్త వంగడాలను సిద్ధం చేయడంతోపాటు నీరు, ఎరువులు వంటి వ్యవసాయ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు ప్రణాళికలను కూడా రూపొందించిందని తెలిపారు. కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలన్నీ ఇప్పుడు వాడకంలో ఉన్నాయని, గత ఏడాది గోధుమ వంగడం అధిక వర్షాలను కూడా తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్–క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్, ఐసీఏఆర్–డీడీజీ ఎస్.కె.చౌదరి, డేర్ కార్యదర్శి అల్కా నంగియా అరోరా పాల్గొన్నారు.

మృత్యు పాశాలు

- విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం
- మంచిర్యాలలో తండ్రి, కుమారుడు..
- సిద్దిపేట జిల్లాలో పెళ్లయిన మూడు రోజులకే నవ వరుడు..

వెలుగులు పంచే విద్యుత్ తీగలు బతుకుల్లో అంధకారం నింపాయి. ముగ్గురి జీవితాలకు ఉరితాళ్లయ్యాయి. రెండు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చాయి. దండెంపై బట్టలు ఆరేస్తూ విద్యుదాఘాతానికి గురైన తండ్రి.. అతన్ని కాపాడబోయిన కొడుకు కన్నుమూస్తే.. మరోచోట కొత్త పెళ్లికొడుకు పెళ్లయిన మూడోరోజే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘటనలు రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి..



నిరంజన్‌చారి (ఫైల్)



అరుణ్ కుమార్(ఫైల్)



రాజేందర్ (ఫైల్)



కారణమైన ఇనుప కూలర్, పైన దండెం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సిద్దిపేట కమాన్: మంచిర్యాల పట్టణం ఏసీసీ కాలనీ శివరామాలయం వీధికి చెందిన ఎడ్ల రాజేందర్ (50), సెక్యూరిటీ గార్డుగా, భార్య సరోజ ఇళ్లలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఎంసీసీ క్వార్టర్‌లో నివసిస్తున్న వీరి కొడుకు అరుణ్‌కుమార్(17) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షోరూం నుంచి అరుణ్‌కుమార్ ఇంటికి భోజనానికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి రాజేందర్ స్నానం చేసి, దండెంపై తువ్వాలు ఆరేస్తుండగా ఇనుప కూలర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రి అరుపులు విని అతన్ని కాపాడబోయిన అరుణ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాజేందర్ తమ్ముడు కర్రతో విద్యుత్‌తీగను గట్టిగా కొట్టడంతో.. తండ్రీకొడుకులు కింద పడ్డారు. అనంతరం ప్రథమ చికిత్సలో భాగంగా వారిద్దరి శ్వాస ఆడేందుకు ప్రయత్నించినా కోలుకోలేదు. దీంతో 108 అంబులెన్సులో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా తండ్రీకొడుకులు ఇద్దరూ అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహమైన మూడ్రోజులకే..

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన జయలక్ష్మి, పెంటయ్య చారి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు రామోజు నిరంజన్‌చారి (38) ఉన్నారు. వీరు కుటుంబంతో కలిసి సిద్దిపేట పట్టణం నాసర్‌పురలో నివసిస్తున్నారు. నిరంజన్ 2003 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికై 2005 నుంచి పనిచేస్తున్నారు. 2012 నుంచి సిద్దిపేట ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నిజామాబాద్ బోధన్‌కు చెందిన అమ్మాయితో శనివారం ఘనంగా వివాహం జరిగింది. సోమవారం పట్టణంలోని ఎన్జీవో భవన్‌లో ఘనంగా రిసెప్షన్ ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్‌కు బంధువులను ఆహ్వానించడానికి నిరంజన్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటిపైకి వెళ్లారు. ఈ క్రమంలో భవనానికి అలంకరించిన విద్యుద్దీపాలకు సపోర్ట్‌గా కట్టిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, నవవధువు రోదించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సహోపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో నిరంజన్ మృతదేహానికి అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ప్రజల నుంచి వసూలు చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం స్పష్టం చేసింది.

ఎంత సబ్సిడీ చెల్లించకపోతే అంత మోత..

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం సబ్సిడీతో పోలిస్తే వాస్తవంగా చెల్లిస్తున్న సబ్సిడీ తక్కువగా ఉంటుండటంతో డిస్కంలు భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన సబ్సిడీ మేరకు చార్జీలను పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిందేనని కేంద్రం ఆదేశించింది. ఉదాహరణకు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు యూనిట్‌కు రూ.8 చార్జీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తోంది. దీంతో వినియోగ దారులు చెల్లించే రూ.4కు లోటు సబ్సిడీ రూ.2 కలి పి మొత్తం రూ.6కు చార్జీ పెంచుకోవాల్సిందిగా కేంద్రం సూచించింది. ఒకవేళ ప్రభుత్వం సబ్సిడీ పూర్తి గా చెల్లించని పక్షంలో రూ.8 వసూలు చేసుకోవాల ని ఆదేశించింది.

ఇకపై సబ్సిడీల వివరాలతో త్రైమాసిక నివేదికలు

కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీలను ఎప్పటికప్పుడు ముందస్తుగా డిస్కంలకు చెల్లించకతప్పని పరిస్థితి నెలకొంది. కాగా కేటగిరీల వారీగా వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలను కచ్చితంగా లెక్కించడానికి కొత్త విధానాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కేటగిరీల వారీగా ఓ త్రైమాసికంలో సబ్సిడీ వినియోగదారులు ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ప్రతి యూనిట్ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా చెల్లించిన సబ్సిడీ ఎంత? ఇంకా రావాల్సిన సబ్సిడీ బకాయిలు/లోటు ఎంత? అనే వివరాలతో రాష్ట్రాల ఈఆర్సీలు త్రైమాసిక నివేదికను విడుదల చేయాలి. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఈఆర్సీకి డిస్కంలు ఈ మేరకు వివరాలతో నివేదికను సమర్పిస్తాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన సవరణలతో 30 రోజుల్లోగా ఈఆర్సీ తుది త్రైమాసిక నివేదికను ప్రకటిస్తుంది. నిబంధనల మేరకు విద్యుత్ సబ్సిడీ అకౌంటింగ్ జరగలేదని, సబ్సిడీల కోసం ప్రభుత్వానికి బిల్లులు పంపించలేదని తేలితే డిస్కంలోని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీలను కేంద్రం ఆదేశించింది.

జిల్లా వార్తలు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పీఓ దరఖాస్తులపై అధికారులతో సమీక్షిస్తూ అర్హులకు సత్వరమే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గిరిజన విద్యార్థుల కనీస సామర్థ్యాలు అంచనా సర్వేపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ దర్బారులో ఐటీడీఏ పరిపాలనా అధికారి భీమ్, అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, దుర్గయ్య, హరీశ్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 15 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న 15 మంది ఈ అండ్ ఎం అధికారులను యాజమాన్యం బదిలీ చేసింది. ఈ మేరకు ఈఈ సెల్ జీఎం కవితానాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురు ఏజీఎం స్థాయి, ఆరుగురు డీజీఎం స్థాయి అధికారులతో పాటు ముగురు ఎస్ఈలు, ఇద్దరు ఈఈ స్థాయి అధికారులు ఉన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలలో తరగతులు ప్రారంభం

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గానికి మంజూరైన జేఎన్‌టీయూ కళాశాలను తాత్కాలికంగా ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలోని మహ్మదీయ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. మూడు బ్రాంచ్‌ల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కాగా, కళాశాల ఆలస్యంగా మంజూరైన నేపథ్యాన విద్యార్థులు చేరేందుకు ఈనెల 8వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

అడ్తీ లైసెన్సులకు అర్హుల గుర్తింపు

- 420 మంది దరఖాస్తుదారుల్లో 140 మంది ఎంపిక
- ఈనెల 8న నూతన లైసెన్సుల జారీ



ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా అడ్తీ(కమీషన్) లైసెన్సులను జారీ చేసేందుకు అర్హులను గుర్తించారు. అడ్తీదారుల లైసెన్సుల కోసం 420 దరఖాస్తులు అందగా, వారిలో 140 మందిని మార్కెట్ కమిటీ ఎంపిక చేసింది. ఎంపికైన వారు నిర్దేశించిన ధ్రువపత్రాలను సమర్పిస్తే లైసెన్సులు జారీ చేయనున్నారు. రైతులు, పంట కొనుగోలు చేసే ఖరీదుదారులకు ధరల విషయంలో మధ్యవర్తులుగా అడ్తీదారులు వ్యవహరిస్తారు. అంతేకాక రైతుల పంట ఖర్చుకు పెట్టుబడి కూడా సమకూరుస్తారు. అనంతరం పంటలను మార్కెట్‌లో ఖరీదుదారులకు చూపించి ధర నిర్ణయించి రూ.2 చొప్పున కమీషన్ తీసుకుంటారు. ఇలా ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 470 మంది ఉండగా.. కొందరు పనిచేయకపోవడంతో 350 మంది వరకు ఉన్నట్లు అంచనా. ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే రెండో పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరున్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొందరు లైసెన్సు లేకుండా అడ్తీ వ్యాపారులుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఏటా రూ.25 వేల కోట్ల విలువైన లావాదేవీలు జరుగుతున్నందున ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అడ్తీదారుల సంఖ్యను పెంచాలని మార్కెట్ కమిటీ నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం కొందరికి లైసెన్సు ఇవ్వగా, మళ్లీ తాజాగా లైసెన్సులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందుకోసం గతనెల 30 నుంచి దరఖాస్తులు స్వీకరించగా, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం పర్యవేక్షించారు.

అనుభవం, స్థోమత ఆధారంగా...

అడ్తీ లైసెన్సుల కోసం 420 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 140 మందిని ఎంపిక చేశారు. వ్యాపార అనుభవం, ఆర్థిక స్థోమత అంశాలను ప్రామాణికంగా తీసుకున్నట్లు మార్కెట్ కమిటీ వెల్లడించింది. ఇందులో భాగంగా ఎంపికైన వారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వీరు అవసరమైన ధృవపత్రాలతో పాటు రూ.1,000 డీడీ సమర్పించాల్సి ఉంటుంది. నిర్దేశిత ధృవపత్రాలు, డీడీలు సమర్పించిన వారికి ఈ నెల 8వ తేదీన లైసెన్సులు జారీ చేయనున్నారు.

ఉత్సాహం.. నిరుత్సాహం

లైసెన్సులకు ఎంపికైన వారు ఆనందం వ్యక్తం చేస్తుండగా.. దరఖాస్తు చేసుకున్న మిగతా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కూడా అన్ని అర్హతలు ఉన్నందున లైసెన్సు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ అంశంపై మార్కెట్ కమిటీ బాధ్యులు మరికొన్నాళ్లకు ఇంకొందరికి లైసెన్సులు జారీ చేసే అవకాశముందని తెలిపారు.

చదివిన కళాశాలకే డీన్‌గా!

అరుదైన అవకాశం దక్కించుకున్న హేమంత్‌కుమార్



అహ్మద్ హుస్సేన్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న హేమంత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: ఓ పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. ముప్పై మూడేళ్ల క్రితం వ్యవసాయ కళాశాలలో చదువుకున్న డాక్టర్ హేమంత్‌కుమార్ ఇప్పుడు ఇదే కళాశాలలో డీన్‌గా బాధ్యతలు స్వీకరించడం హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుత ఖమ్మం జిల్లా వేంసూరు మండలం దిద్దుపూడికి చెందిన హేమంత్‌కుమార్ అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో 1993 బ్యాచ్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థిగా చేరి, 1994లో పట్టాను అందుకున్నారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన ఆయన శాఖలో అనేక హోదాల్లో విధులు నిర్వర్తించారు. గడిచిన ఏడేళ్లుగా ఖమ్మం జిల్లాలోని వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా ఇటీవల పదోన్నతి కల్పించి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్‌గా నియమించారు. దీంతో చదివిన కళాశాలలోనే డీన్‌గా అరుదైన అవకాశాన్ని అందుకున్నట్లయింది. ఇక్కడ చదివిన పలువురు ఇదే కళాశాలలో ప్రొఫెసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఉన్నతమైన స్థానం(డీన్) దక్కించుకున్న ఘనత మాత్రం హేమంత్ కుమార్‌కే దక్కింది.

బాధ్యతలు స్వీకరించిన హేమంత్‌కుమార్

అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ జె.హేమంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీన్‌గా ఉన్న డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌కు సంగారెడ్డిలోని కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాలకు బదిలీ కాగా, ఆయన అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. అనంతరం వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ డీన్‌గా బదిలీపై వచ్చిన హేమంత్ బాధ్యతలు స్వీకరించారు.

గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులను విస్మరించి బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాన్ని వర్తింపచేస్తే ఆందోళనలు నిర్వహిస్తామని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్.ప్రదీప్ హెచ్చరించారు. ఖమ్మంలోని రానరసయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకాన్ని అటకెక్కించి గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. అలాగే, దరఖాస్తుకు నాలుగు రోజుల సమయమే ఇవ్వడంతో అర్హులు నష్టపోయే అవకాశముందన్నారు. ఇకనైనా పార్టీ పథకంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వీ.రాకేష్, నాయకులు కూసు మోహన్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, ధరణి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని, అందులో ఎలాంటి సందేహం లేదని రాష్ట్ర మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు. అశ్వారావుపేటలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుంకవల్లి వీరభద్రరావు ఇంట్లో శుభకార్యానికి సోమవారం హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించడమే తన రాజకీయ లక్ష్యమని తెలిపారు. ఈ పని పూర్తిచేసేందుకు ఎన్నికల్లో నిలబడుతున్నానని, అనుచరులు, ప్రజల కోరిక మేరకే తన నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి వద్ద ఉన్న వెంకమ్మ చెరువు కాల్వల నిర్మాణంపై ఆరా తీసిన ఆయన ఇరిగేషన్ డీఈ కృష్ణతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. అలాగే కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సీతారామ ప్రాజెక్టు మాదిరి పరిహారం ఇచ్చేలా ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు బండి పుల్లారావు, ఆలపాటి రాము, నిర్మల పుల్లారావు, జేకేవీ.రమణారావు, జ్యేష్ఠ సత్యనారాయణ, ఇస్మాయిల్, బాజీ, ఆంద్రు ప్రసాద్, బుజ్జీ, జీవన్‌రావు, లింగొెట్టి వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించండి

వీసీలో సింగరేణి సీఎండీ శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం, సత్తుపల్లి, కిష్టారం ఓసీల అధికారులు

సత్తుపల్లిరూరల్: ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించగా, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యాన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ రాఖీ పౌర్ణమి లక్కీ డ్రా



సత్తుపల్లిలోని డ్రా బాక్స్‌లో టికెట్ వేస్తున్న యువతి

ఖమ్మంమామిళ్లగూడెం: రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో విజేతలను మంగళవారం ఎంపిక చేయనున్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా యజమాన్యం లక్కీ డ్రా ఏర్పాటుచేయగా, 30, 31వ తేదీల్లో ప్రయాణించిన మహిళలు టికెట్లపై వివరాలు రాసి బస్టాండ్లలోని బాక్సుల్లో వేశారు. ఇందులో నుంచి రీజియన్‌కు ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతి ఇవ్వాలని సంస్థ నిర్ణయించింది. విజేతలను రీజియన్ కేంద్రాల్లో ఎంపిక చేసి విజేతలకు హైదరాబాద్ ఎంజీబీఎస్ ప్రాంగణంలో ఈనెల 8న అందజేయనున్నారు.